## అధ్వానంగా రహదారి



కంకర తేలి అధ్వానంగా మారిన సారంగాపూర్ నుంచి బట్టపెల్లి వెళ్లే రోడ్డు

సారంగాపూర్ నుంచి భీమన్న గుట్ట మీదుగా బట్టపెల్లి, పోతారం వరకు ఉన్న తారు రోడ్డు మొత్తం గుంతలు పడి, కంకర తేలడంతో వాహనదారులు, రైతులు, గిరిజనులు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సారంగాపూర్, బట్టపెల్లి, పోతారం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. -సారంగాపూర్, జూన్ 1

# ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు కరువు..!

- పట్టించుకోని అధికారులు
- వానకాలంలో ఇండ్లల్లోనే బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న ప్రజలు

కోరుట్ల, జూన్ 1: కోరుట్ల పట్టణంలోని ప్రకాశంరోడ్, అయిలాపూర్, ఝూన్సీ రోడ్డు, గోవిందగిరి కాలనీ, ముత్యాలవాడ, రాంనగర్, ఆదర్శనగర్, తాళ్ల చెరువు మత్తడి కింది ప్రాంతాల్లోని గంగంపేట, రవీంద్ర రోడ్డు కాలనీలు వానకాలంలో వరద నీటితో పూర్తిగా జలమయమవుతున్నాయి. రోడ్లపై మూడు అడుగుల మేర రోజుల తరబడి వరద నీరు నిలిచి కాలనీ వాసులు బిక్కుబిక్కుమంటూ ఇండ్లల్లోనే ఉంటున్నారు. ఇండ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో పట్టణంలోని దిగువ ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నా పాలకులు, అధికారులకు పట్టింపు లేకుండా పోయింది. నామ మాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారే తప్పా శాశ్వత పరిష్కారానికి కృషి చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



పట్టణంలోని ప్రకాశం రోడ్డులో చెరువును తలపిస్తున్న వరదనీరు (ఫైల్)

### ముంపునకు ఆక్రమణలే కారణం

ముంపు ప్రభావిత కాలనీల్లో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నూతన భవనాలు, గతంలో ఉన్న కాలువల ఆక్రమణలు, సెట్ బ్యాక్ లేకుండా ఇండ్ల నిర్మాణాలు చేపట్టడంతో రహదారులు ఇరుకుగా మారడం, వరదనీరు మురుగు నీటితో కలిసి దిగువ ప్రాంతాల్లోని కాలనీలను ముంచెత్తడం వానకాలంలో పరిపాటిగా మారింది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు వెళ్లేందుకు ప్రకాశం రోడ్డులో కాలువలు కుచించుకుపోవడంతో కాలనీలోని అంతర్గత రహదారులు జలమయమవుతున్నాయి. దీంతో ఇండ్లల్లోకి వరద నీరు, విష సర్పాలు వస్తున్నాయి. ప్రతి సంవత్సరం వరదలు ముంచెత్తుతుండడంతో ఇండ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలపై పూర్తిస్థాయిలో ప్రణాళికలు చేపట్టకపోవడంతో ముంపునకు గురై కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న వానకే పలు కాలనీల్లోని మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి.

### శాశ్వత పరిష్కారానికి చర్యలేవి...

పట్టణంలోని మురుగు కాలువల ద్వారా మద్దుల చెరువులోకి వరద నీరు చేరడమే వరద ముంపునకు కారణమవుతున్నది. పట్టణ ప్రగతి నిధులతో మురుగు నీరు చెరువులో చేరకుండా అధికారులు అండర్‌గ్రౌండ్ వరద కాలువలు నిర్మించారు. సరైనా ప్రణాళిక లేకపోవడంతో నీరు మళ్లింపు చర్యలు కార్యరూపం దాల్చలేదు. స్తంభాల చెరువు నిండిన తర్వాత పట్టణంలోని పీతిరికుంట, కంచరకుంట, మద్దుల చెరువు, లస్మాగౌడ్‌కుంట, బొల్లి కుంట, అయిలాపూర్ పాడిచెరువు, పెద్దచెరువును కలుపుతూ గతంలో గొలుసుకట్టు చెరువులు, కాలువలు, ఉండేవి. స్తంభాల చెరువు మత్తడి దుంకిన నీరు షరాబు కుంట, తాళ్లచెరువులో చేరిన తర్వాత మత్తడి దుంకి కాలువ ద్వారా కోరుట్లలోని పూల్ వాగులో కలిసేది. స్తంభాల చెరువు కింద ఉన్న చెరువులు, కుంటలు, కాలువలు చాలా మేరకు ఆక్రమణకు గురికావడంతో, ప్రధాన కాలువలు కోతకు గురవుతున్నాయి. దీంతో వరద నీరు రోడ్లు, కాలనీలను ముంచెత్తుతోంది. కంచరకుంటకు వెళ్లే కాలువ బిలాల్ పుర, ఏస్కోనిగుట్ట వద్ద దెబ్బతిని ఆ కాలనీలను ముంచెత్తుతుంది. కంచరకుంట మత్తడి నుంచి నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో దిగువ భాగంలో ఉన్న ఆదర్శనగర్ కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంటుంది. మద్దుల చెరువు కింది భాగంలో ప్రకాశంరోడ్డు కాలువ మార్గంలో పట్టా భూములు ఉండడం, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలువను ఆక్రమించుకోవడంతో మురుగు కాలువలు సగానికి సగం కుచించుకుపోయాయి.

### వానకాలంలో బయటకు రాని పరిస్థితి

వరద ముంపు తీవ్రంగా ఎదుర్కొంటున్న లోతట్టు ప్రాంతాలైన ప్రకాశం రోడ్డు, ఝూన్సీ రోడ్డు వాసులు చిన్నపాటి వర్షానికే వీధుల్లోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలకు మద్దుల చెరువు నుంచి వచ్చే వరద నీరు ఈ కాలనీలను చుట్టి వేయడంతో రోజుల తరబడి బయటకు రాని పరిస్థితులు నెలకొంటున్నాయి. వరద ముప్పు పొంచి ఉన్న సమయాల్లో మున్సిపల్ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి పునరావాస కేంద్రాలకు తరలించడం ఏటా నిత్య కృత్యమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మద్దుల చెరువు నీటిని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పూల్ వాగులోకి తరలించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు వేడుకుంటున్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం

జగిత్యాల, జూన్ 1: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అమరవీరుల పార్కు వద్ద ఉదయం 9.30 గంటలకు తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో 10 గంటలకు వేడుకల ముఖ్య అతిథి ధర్మపురి ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపన, తెలంగాణ గీతాలాపన, పోలీస్ గార్డ్స్ నుంచి వందన సమర్పణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి ప్రభుత్వ సందేశం, 10.30 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని పేర్కొన్నారు.

## ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల రూరల్, జూన్ 1: జగిత్యాల పట్టణంలోని పావని కంటి దవాఖానలో ఆదివారం ఆపీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 19 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి, కళ్లద్దాలు, మందులు అందజేశారు. డాక్టర్ విజయ్, నాయకులు నర్సయ్య, రాజేశ్, పరశురాం, ఆరీఫ్, రాజు పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్, జూన్ 1: మండల కేంద్రంలోని ఒడ్డెర కాలనీకి చెందిన దండుగుల శ్రీనివాస్ (22) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ హైదరాబాద్‌లో హోటల్ పెట్టుకొని జీవనోపాధి పొందాడని, అక్కడ పరిస్థితులు అనుకూలించక నష్టపోయి స్వగ్రామానికి తిరిగి వచ్చి డ్రైవర్, ఇతర కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. ఈ క్రమంలో ఆయన తల్లి మానసిక స్థితి బాగా లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఆదివారం వేకువజామున కాలనీ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ఇన్‌చార్జి ఎస్ఐ రాజు నాయక్, హెడ్ కానిస్టేబుల్ నర్సింగరావు పరిశీలించి, వివరాలు సేకరించారు. శ్రీనివాస్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

జగిత్యాల, జూన్ 1: వయో వృద్ధులకు ప్రభుత్వ దవాఖానల్లో ప్రత్యేక వైద్యసేవలందిస్తున్నట్లు తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఆయన వృద్ధులకు అందుతున్న ప్రత్యేక వైద్య సేవలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ, జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో వయోవృద్ధులకు ప్రత్యేక చికిత్స వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, కోశాధికారి ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షులు హన్మంత రెడ్డి, ఎండీ యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు అశోక్ రావు, నారాయణ, సంజీవ రావు, తదితరులు పాల్గొన్నారు.

## సంఘాలు-కార్యవర్గం



పెగడపల్లి: ఎన్నికైన రెడ్డి సంఘం సభ్యులు

పెగడపల్లి, జూన్ 1: పెగడపల్లి మండలం నందగిరిలో ఆదివారం రెడ్డి సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్డి సంఘం అధ్యక్షుడిగా పటేల్ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోపు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వాడె మహిపాల్‌రెడ్డి, కార్యదర్శిగా నారెడ్డి కరుణాకర్‌రెడ్డి, కోశాధికారిగా గోపు నర్సింహరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఆవాల మల్లారెడ్డి, సంకిటి వెంకటరెడ్డి, పటేల్ మల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడు నారెడ్డి రాజిరెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, జూన్ 1: మండలంలోని డబ్బుతిమ్మాయిపల్లి గ్రామంలో ముట్టి గొల్ల సంఘం గ్రామ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగిడి మహిపాల్, ఉపాధ్యక్షుడిగా జంగిడి కొమురయ్య, కార్యదర్శిగా మార్కం మల్లేశ్, కోశాధికారిగా అరె సంతోష్ ఎన్నుకున్నారు. ఏడాది పాటు కార్యవర్గం కొనసాగనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.

మల్లాపూర్, జూన్ 1: పాతదాంరాజ్‌పల్లి గ్రామంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా గజ్జి నరేశ్, ఉపాధ్యక్షుడిగా గాజుల నడ్పి రాజిరెడ్డి, వీడీసీ సభ్యుడిగా గాజుల రాజిరెడ్డితో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించారు.

కోరుట్ల, జూన్ 1: పట్టణంలోని అసంప్షన్ పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి ఆట్యా-పాట్యా గేమ్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ ముఖేష్, ఎన్నికల అబ్జర్వర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వాసం నవీన్‌కుమార్, కార్యదర్శిగా కొక్కుల రాజేశ్, ఉపాధ్యక్షులుగా గౌటి రవీందర్, గాజెంగి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా వాసాల రాజు, వాసం సంజయ్ కుమార్, కోశాధికారిగా మహిపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, నవీన్, విజయ్, శ్యామ్, సుమతి, గంగాసాగర్, విజ్ఞాన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు గంగాధర్, లక్ష్మీనారాయణ, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

## వానకాలం పంటకు సాగు నీరందించేలా చర్యలు

సారంగాపూర్, జూన్ 1: బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్ట్ నుంచి వానకాలం పంటకు సాగునీరందించేలా చర్యలు చేపడుతున్నారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. ప్రాజెక్ట్‌లో 0.25 టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు పనులు నడుస్తున్నాయని, త్వరలోనే గేట్లు బిగించి సాగునీరందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్ రావు, నాయకులు చెరుపూరి సుభాష్, ముక్క శంకర్, గుడిసే జితేందర్ యాదవ్, జోగిరెడ్డి, ఆడెపు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

రాయికల్, జూన్ 1: రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 2001-02 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానికి ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. 23 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలిసి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ, ఇలాంటి సమ్మేళనాల ద్వారా గురుశిష్యుల బంధం బలపడుతుందన్నారు. అలాగే, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ బాలె జయశ్రీ, ఉపాధ్యాయులు రాజేశం, నర్సయ్య, సత్యనారాయణ, పురుషోత్తం, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు సతీశ్, శ్రీకాంత్, రాజశేఖర్, భరత్, నరేశ్, రమేశ్, జీవన్, అజయ్ పాల్గొన్నారు.

## మా ఊరి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తాం

కథలాపూర్, జూన్ 1: మా ఊరి పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తామని చింతకుంట గ్రామస్తులు ఆదివారం తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూమయ్య, ఉమ్మడి కరీంనగర్ డీసీసీ మాజీ కార్యదర్శి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు రవి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

## రేపటి నుంచి భూభారతి రెవెన్యూ గ్రామసభలు

మల్లాపూర్, జూన్ 1: మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు భూభారతి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గుగ్గిళ్ల రమేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న వాల్గొండ, వీవీరావుపేట, 4న దాంరాజ్‌పల్లి, గొర్రెపల్లి, 5న సంగెం-శ్రీరాంపూర్, రేగుంట, 6న ఓబులాపూర్, సాతారం, 9న మొగిలిపేట, చిట్టాపూర్, 10న రాఘవపేట, ముత్యంపేట, 11న నడికుడ, సిరిపూర్, 12 రాందాస్‌పేట, కుస్తాపూర్, 13న గుండంపల్లి, అడవి మాదాపూర్, రత్నాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు భూ సమస్యలుంటే ఈ సభల్లో దరఖాస్తు చేసుకోని పరిస్కరించుకోవాలని సూచించారు.

కథలాపూర్, జూన్ 1: మండలంలోని గ్రామాల్లో ఈనెల 3 నుంచి భూభారతి చట్టంపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. 3న పెగ్గెర్ల, ఊట్‌పెల్లి, 4న దుంపేట, పోసానిపేట, 5న దూలూరు, బొమ్మెన, 6న పోతారం, ఇప్పపెల్లి, 9, 10 తేదీల్లో తాండ్ర్యాల, గంభీర్‌పూర్, 11న తుర్తి, కలికోట, 12, 13 తేదీల్లో సిరికొండ, అంబారిపేట, 16, 17 తేదీల్లో కథలాపూర్, తక్కళ్లపెల్లి, 18, 19 తేదీల్లో భూషన్‌రావుపేట, చింతకుంటలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మేడిపల్లి, జూన్ 1: మేడిపల్లి మండలం వల్లంపల్లి ఈ నెల 3న భూ భారతి గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ మునీందర్ తెలిపారు. 4న మాచాపూర్, 5న దమ్మన్నపేట, 6న కాచారం, 9న కల్వకోట, 10, 11న కొండాపూర్, 12, 13న మేడిపల్లి, 16, 17న పోరుమల్ల, 18, 19న కట్లకుంట, 20న తొంబర్‌రావుపేటలో నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, భీమారం మండలం రంగాపూర్‌లో ఈ నెల 3న , లింగంపేటలో 4న , వెంకట్రావుపేటలో 5న, రాగోజిపేటలో 6న, ఒడ్యాడ్‌లో 9న, మన్నెగూడెంలో 10, 11న, భీమారంలో 12, 13న, పసునూర్‌లో 16న, గోవిందారంలో ఈనెల 17, 18న గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ రవికిరణ్ తెలిపారు.

## 1.04 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

పెగడపల్లి, జూన్ 1: పెగడపల్లి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 10 కేంద్రాల ద్వారా 1134 మంది రైతుల వద్ద 104236 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏపీఎం సమత పేర్కొన్నారు. ఆదివారంతో ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు వివరించారు. ధాన్యానికి సంబంధించి రైతుల వారీగా వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. కాగా, ఇందులో 3444 క్వింటాళ్ల సన్న రకం వడ్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.


## ముగిసిన యోగా శిక్షణ తరగతులు

పెగడపల్లి, జూన్ 1: మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. శ్రీ వేద యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తుండగా, పెగడపల్లి, ఐతుపల్లి, బతికపల్లి, తదితర గ్రామాలకు చెందిన 30 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగా గురువు కముటం గంగారాం మాట్లాడుతూ, నిత్యం యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆయుష్ ట్రైనర్ చింతకింది కిశోర్, యోగా శిక్షకుడు జంజురు రాజమల్లు, రెడ్డి సంఘం అధ్యక్షుడు నర్సింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కోరుట్ల రూరల్, జూన్ 1: మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రవ్ తనిఖీలు చేపట్టారు. అలాగే, లైసెన్స్, వాహనాల పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## కళలను పరిరక్షించాలి



సభ్యత్వాలు తీసుకుంటున్న సభ్యులు

జగిత్యాల, జూన్ 1: భారత దేశం కళలకు పుట్టినిల్లు అని, అలాంటి కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సంస్కార భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి జేపీ నిరంజన్ పేర్కొన్నారు. జగిత్యాలలో ఆదివారం సంస్కార భారతి సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని ప్రాచీన కళలను ప్రజలకు పరిచయం చేసి చైతన్యవంతం చేయాలన్నారు. అనంతరం సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బొమ్మిడి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా భీమయ్య, సహాయకార్యదర్శులుగా వేముల చంద్రశేఖర్, భీమయ్య, ఉపాధ్యక్షులుగా కట్ట విజయ్, గంగాధర్, సుచరిత, నీలం దశరథ రెడ్డి, శ్రీరాములు గౌడ్, మనోజ్, రేఖ, ప్రచార ప్రముఖ్‌గా వెంకటసాయి, రాజేంద్రప్రసాద్, అనిత, రాజన్న, లక్ష్మీనారాయణ, ఇప్ప జగన్, నరేందర్, అశోక్, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## క్రీడా దుస్తులు అందజేత

కథలాపూర్, జూన్ 1: కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట గ్రామంలో 20 మంది క్రికెట్ క్రీడాకారులకు పీడీ గుండెల రాజేశ్ ఆదివారం క్రీడా దుస్తులు అందజేశారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తన వంతుగా క్రీడా దుస్తులు గుండెల రాజేశ్ తెలిపారు.

## ఎల్ఐసీ ఏవోకు సత్కారం



వెంకటరమణను సన్మానిస్తున్న శ్రీనివాస్, తదితరులు

జగిత్యాల, జూన్ 1: జిల్లా కేంద్రానికి చెందిన ఎల్ఐసీ ఏవో కేరితి వెంకటరమణ ప్రసాద్ ఉద్యోగ విరమణ పొందగా, అంబారిపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నిజామాబాద్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ బండారి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విత్తనాల అభివృద్ధి సంస్థ యజమాని సత్యనారాయణ, ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ బలరామకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ రావు, గుడికందుల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.


## ఆయిల్ పామ్ తోట దగ్ధం



దగ్ధమైన ఆయిల్ పామ్ చెట్లు

ధర్మపురి, జూన్ 1: ధర్మపురి మండలం కొసునూర్‌పల్లి మాజీ సర్పంచ్ ఎన్నం లక్మారెడ్డి ఆయిల్ పామ్ తోట ప్రమాదవశాత్తు జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. లక్మారెడ్డి తనకున్న మూడెకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశాడు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఆయిల్ పామ్ తోటతో పాటు పైప్‌లైన్లు, డ్రిప్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## మున్నూరు కాపు కులస్తుల ఆత్మీయ సమ్మేళనం



వేదికపై మున్నూరు కాపు కులస్తులు


మెట్‌పల్లి, జూన్ 1: పట్టణంలోని గోల్ హనుమాన్ మున్నూరు కాపు పటేల్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా జరుపుకొన్నారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. మున్నూరు కాపు కులస్తులంతా కలిసి సామూహిక భోజనాలు చేశారు.

## జగిత్యాల అభివృద్ధికి కృషి

జగిత్యాల, జూన్ 1: జగిత్యాల పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 29వ వార్డులో ఈద్గా, దగ్గులమ్మ ఆలయం వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగిత్యాల పట్టణాభివృద్ధే తన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, డీఈ వరుణ్, ఏఈ శరణ్, మాజీ కౌన్సిలర్ పంబాల రాము, బాలే శంకర్, దుమాల రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ తోట మల్లికార్జున్, రజాక్, ముకీద్, కుసర్, పటేల్, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను నిలదీసిన మహిళ...

జిల్లా కేంద్రంలోని దగ్గులమ్మ గుడి వద్ద అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి వెళ్తుండగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు చేదు అనుభవం ఎదురైంది. 29వ వార్డుకు చెందిన లక్ష్మి తనకు ఇల్లు లేదని, ఒంటరి మహిళ పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా వస్తలేదని ఎమ్మెల్యేను నిలదీశారు. కాగా, లక్ష్మితో ఎమ్మెల్యే మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



కాలనీ మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

## పోలీసులకు సేవా పతకాలు

జగిత్యాల కలెక్టరేట్/కోరుట్ల, జూన్ 1: పోలీసు శాఖలో విశిష్ట సేవలందించినందుకు గానూ రాష్ట ప్రభుత్వం అందించే పోలీస్ సేవా పతకాలకు జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు ఎంపికయ్యారు. పతకాలు అందుకోనున్న పోలీసు అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. విధి నిర్వహణలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు వస్తుందన్నారు. రానున్న రోజుల్లో సైతం మరింత ఉత్తమ సేవలందించాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆకాంక్షించారు. ఏఆర్ ఎస్ఐ రామస్వామి, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ శ్రీనివాస్ ఉత్తమ సేవా పతకం, ఎండీ జమీల్, నరసింహారెడ్డి (ఏఎస్ మెట్‌పల్లి పీఎస్), భిక్షపతి (స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ), ఎస్ శ్రీనివాస్ (ఆర్ఎస్ఐ, జగిత్యాల), ఎం మల్లారెడ్డి, రవి (హెడ్ కానిస్టేబుల్, మల్యాల), నీల్యా నాయక్, శ్రీనివాస్ (హెడ్‌కానిస్టేబుల్, కథలాపూర్), మహ్మద్ ఇలియాస్ అహ్మద్ (హెడ్‌కానిస్టేబుల్, మేడిపల్లి), ఎస్ నాగన్న, మల్లారెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, జగిత్యాల), రాజమౌళి (హెడ్ కానిస్టేబుల్, గొల్లపెల్లి), ఎస్ తనోబా (హెడ్‌కానిస్టేబుల్, ఇబ్రహీంపట్నం), ప్రకాశ్ (హెడ్ కానిస్టేబుల్, మెట్‌పల్లి) సేవా పతకానికి ఎంపికయ్యారు.

## ఉపాధిహామీలో పశువుల, కోళ్ల షెడ్డు నిర్మాణం

కథలాపూర్, జూన్ 1: ఉపాధిహామీ పథకం కింద పశువుల పాకలు, కోళ్ల షెడ్లు, ఫాంపాండ్ల నిర్మాణానికి ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యానవన పంటల సాగుకు కూడా ఉపాధిహామీ పథకం సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధిహామీ జాబ్ కార్డు ఉండి, ఐదేకరాల్లోపు భూమి ఉన్న వారు అర్హులని తెలిపారు.

## జగ్గాసాగర్‌లో ఉచిత వైద్య శిబిరం

మారుతీనగర్, జూన్ 1: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఓ ప్రైవేట్ పిల్లల దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత పిల్లల వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వైద్యుడు చిలుక చైతన్య గ్రామంలోని 110 మంది పిల్లలకు వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకులు

కోరుట్ల, జూన్ 1: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన మాస్టర్ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు రెండు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్, నాలుగు బ్రౌంజ్ మెడల్స్ సాధించినట్లు తైక్వాండో క్లబ్ కోచ్ నావనంది రమేశ్ తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు రాష్ట్ర తైక్వాండో జనరల్ సెక్రటరీ శ్రీహరి చేతుల మీదుగా పతకాలు అందజేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్‌కుమార్, గంగారావు, రాజేందర్, సతీశ్, సంతోష్, దీక్షిత్ అభినందించారు.

## కోడెల సంరక్షణకు చర్యలు

వేములవాడ టౌన్, జూన్ 1: వేములవాడ రాజన్న కోడెల సంరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పేర్కొన్నారు. తిప్పాపూర్‌లోని రాజన్న గోశాల నుంచి 32 జతల కోడెలను అర్హులైన రైతులకు ఆదివారం పంపిణీ చేశా రు. గోశాల ఆవరణను పరిశీలించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కోడెల సంరక్షణ బాధ్యతను రైతులు పక్కాగా చూసుకోవాలన్నారు. కోడెల సంరక్షణ బాధ్యత పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోశాల ఆవరణలో లోతుగా ఉన్న స్థలంలో మట్టి పోయిస్తూ చదును చేస్తున్నామని తెలిపారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాధాబాయి, ఏవో అఫ్జల్‌బేగం, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

### కోడెల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు భక్తి శ్రద్ధలతో సమర్పించిన కోడెలు కావాలనుకునే రైతులు వెబ్‌సైట్ (https:\\rajanna sir cilla.telangana.gov.in)లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిప్పాపూర్ గోశాలలోని కోడెలను అర్హులైన రైతులకు జియో ట్యాగింగ్ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.